# ప్రేమ రహస్యం

◆ అనిత వొజ్జల ◆

"అయితే ఇప్పుడేమంటావ్" అన్నాడు వరుణ్ చిరాగ్గా.

"ప్రేమంటే $(a+b)^2 = a^2 + 2ab + b^2$ అనే బీజగణిత సమీకరణం లోలా రెండు ప్రక్కలా సమానంగా వుండాలంటాను" అన్నాడు ఋషి.

"అంతే నంటావా?"

"అంతే మరి"

"చదివిన చదువును జీవితానికి అన్వయించు కుంటారా? నా బాధను నువ్వు అర్థం చేసుకోవ ట్లేదు."

"నిన్ను బాగా అర్థం చేసుకున్నా...! అయినా చదువుకునేది ఎందుకురా...? మన జ్ఞానాన్ని జీవితానికి అన్వయించుకొని సుఖపడటాని కేగా...!"

"నీ మొహం"

"నా మొహం నా మొహమేలే...! అసలు విషయమేమిటో చెప్పు."

"నేను ఆమెను గాఢంగా ప్రేమిస్తున్నాను! ప్రేమలో కూడా లాజిక్‌గా చదువును అన్వయించ వంపకని ఎన్నిసార్లు చెప్పాను" అన్నాడు వరుణ్ రోషంగా.

"నీమిటేమిటి?" అన్నాడు ఋషి ఆశ్చ ర్యంగా.

"నేను. ఆమెను గాఢంగా ప్రేమిస్తున్నాను" అన్నాడు వరుణ్ సీరియస్‌గా.

"ఎంత?" అన్నాడు ఋషి బలవంతంగా వచ్చే నవ్వును ఆపుకుంటూ.

"చాలా గాడంగా" అన్నాడు వరుణ్ మరింత సీరియస్‌గా.

"అంటే గాఢ సల్ఫ్యూరిక్ ఆసిడ్ కన్నా ఎక్కువా...?"

"అబ్బా! నీ ఉపమానాలతో ఛస్తున్నాను నేను! అసలు నీకు చెప్పడమే నా బుద్ధి తక్కువ! ఇంకో సారి నీతో ఏం చెప్పను!" అన్నాడు వరుణ్ కోపంగా.

"ఇంకోసారి అననులే! సారీరా!" అన్నాడు ఋషి బాధగా.

వరుణ్‌కు తెలుసు ఆ "సారీ" ఐదు నిమిషాలు మాత్రమే పనిచేస్తుందని ఆ తరువాత షరా మామూలే అని...

"ఏం. సారీనో ఏమో" అన్నాడు వరుణ్ విసు క్కుంటూ.

"అదికాదురా! అసలేమయ్యిందో చెప్పు" అన్నాడు ఋషి బుద్ధిమంతుడిలా మొహం పెట్టి.

"మళ్ళీ మొదటికొచ్చావా?"

"ఆ...! అలాగే అనుకో"

"నేను ఆ అమ్మాయిని ప్రేమిస్తున్నాను."

"అప్పటి నుంచి అదే పాట పాడుతున్నావ్...! ఆ అమ్మాయిని అంటే నేను ఏ అమ్మాయి అని అనుకోవాలి? ఎదురింటి ఎలకమొహం ఎంక మ్మనా...? ప్రక్కింటి పెళ్లికళ్ళ పుల్లమ్మనా? వెను కింటి వంకాయల వెంకాయమ్మగారినా...? పై పోర్షనులోని ఎత్తుపళ్ళ పర్వతరాణినా...?"

"ఛట్! నోర్ముయ్! చంపేస్తాను!"

"మరి సరిగ్గా చెప్పు"

"అదేరా! రోజు ప్రొద్దున్న తొమ్మిది గంటలకు మన రూమ్ ముందు నుంచి వెడుతుందే...... ఆ అమ్మాయిని" అన్నాడు వరుణ్ నేలచూపులు చూస్తూ...

"ఓహో...! ఆ 34–28–32 పిల్లా... పెద్ద కళ్ళు... చక్కని ముక్కు... గుండ్రని పెద వులు... నునుపు చెక్కిళ్ళు... శిల్పం వంటి ఫ్రిగర్ చాలా అందంగా ఉందిరా...!"

"చాలు! ఇక ఆపేయ్!" అన్నాడు వరుణ్ కోపంగా.

"ఏ...! ఎందుకు?" అన్నాడు ఋషి.

"నా లవర్ గురించి ఎందుకలా మాట్లాడు తావ్!"


"నువ్వింకా ప్రేమిస్తున్నట్టే ఆమెకు చెప్ప

●●●

**ఊరి హాల్లో ఊసులాడుతున్నప్పుడు అతని తపస్సు ఫలించినట్లు 'అదే మువ్వలశబ్దం' వినిపించింది.**

●●●

# నువ్వు ప్రేమించినంత మాత్రాన నీ లవ్వర్ అవుతుందా...?



లేదు! అప్పుడే ఆమె నీ లవ్వర్ ఎలా అవుతుం దిరా'' అన్నాడు ఋషి నవ్వుతూ.

''నేను ఆమెను ప్రేమిస్తున్నాను కాబట్టి''

''నువ్వు ప్రేమించినంత మాత్రాన నీ లవ్వర్ అవుతుందా...? అయినా... ఎన్ని రోజుల నుంచి ప్రేమిస్తున్నావ్...?''

''ఆరు నెలల క్రితం ఓ రోజు నేను ఈ కిటికీ దగ్గర కూర్చున్నప్పుడు ఆమె ఇక్కడి నుంచి



## ఇక పౌరాణికాలు, జానపదాలు!?

ఇప్పటి వరకూ ఆల్‌రౌండర్‌గా అన్ని వేషాలూ వేసిన నట కిరీటి రాజేంద్ర ప్రసాద్ 'కన్నయ్య- కిట్టయ్య'లో శ్రీకృష్ణపరమాత్మునిగా బహుచక్కని వేషం వేశారు. అట్లాగే ఇప్పుడు షూటింగ్ పూర్తి చేసుకున్న 'మాయలోడు'లో రాజేంద్రప్రసాద్ వేషం జానపదాన్ని గుర్తు చేస్తోంది. యన్.టి. రామారావు, బాలకృష్ణల తర్వాత రాజేంద్ర ప్రసాద్‌ని కూడా మనం లిస్ట్‌లో వేసుకోవచ్చు.

- మానేపల్లి సంపత్‌బాలకృష్ణ.

---

వెళ్ళింది'' అంటూ రెండు చేతులు తలక్రింద పెట్టుకొని పైకప్పుకేసి చూస్తూ తన్మయత్వంగా.

''ఎలా వుందనుకున్నావ్...' ఆ రోజు నాకిప్పటికి బాగా గుర్తుంది. నేను తల వొంచుకొని కూర్చున్నాను. కాబట్టి రోడ్డు మాత్రమే కనిపిస్తుంది. రెండు నిమిషాల తరువాత నున్నపైన పాదాలు ... తెల్లటి మువ్వలు... ఎర్రటి గోరింటాకు... సముద్రతీరాన విహారానికి వచ్చిన వనకన్య పాదాలు గుర్తొచ్చాయి. వెంటనే గుండె లయ తప్పింది. అప్రయత్నంగానే తలయెత్తాను.''

''పసుపుపచ్చని పట్టులంగా... ఎర్ర పరికిణీ ... ఎర్ర జాకెట్టు శంఖం వంటి మెడ... గుండ్రని మొహం... దానిమ్మ తొనల వంటి పెదాలు... పొడవైన ముక్కు... అర్విప్పవంటి కళ్ళు... నల్లని కనుబొమ్మలు... చిన్న నుదురు... తెల్లగా... చాలా అందంగా వుందామె... రెప్ప వేయకుండా ఆమె వైపే చూడసాగాను.''

''తరువాత'' అని అడిగాడు ఋషి ఎగ్జయిటింగ్‌గా.

''నుదిటిమీదికి పడే ముంగురులను పైకి తోస్తూ ఆమె కూడా అప్పుడే తలెత్తి నా వైపు చూసింది.''

''వెంటనే హృదయంలో హరివిల్లు విరిసింది. శిశిరం వసంతంలో అరవిరిసిన మొగ్గ నవ్వినట్లు ... నీహారికా తెరల్లో నీలిమబ్బు విచ్చుకున్నట్లు ఆమెపై నాలో ప్రేమ మొదలైంది'' అంటూ కనులు మూసుకొని ఏవేవో ఊహాలోకాల్లోకి వెళ్ళిపోయాడు వరుణ్ .

''ఆ...! ఆ తరువాత...'' అన్నాడు ఋషి నిట్టూర్చుతూ.

''నీకు తెలుసుకదరా...! రోజు ఆమె వచ్చే టైమ్‌కు ఇక్కడ నిలబడి చూస్తాను! ఆమె వచ్చిన రోజు ఎంత ఆనందంగా వుంటుందో ఆమె రాని రోజు అంత బాధగా వుంటుంది! ఆమె రాని రోజంతా దిగులే! ఏ పని చెయ్యబుద్ధి కాదు'' అన్నాడు దిగులుగా.

''కిటికీలోనుంచి చూస్తూ నిన్ను చూడక నేనుండలేను అనే వాడ్ని... రోజు బాడీగార్డులా వెనుక పడి తిరిగేవాడ్ని ఏ అమ్మాయి ప్రేమించదురా'' అన్నాడు ఋషి నవ్వుతూ.

''నవ్వుతావేం...? నీకిది జోక్‌లా వుందా?''

''కాదురా! నీ పరిస్థితి చూస్తే జాలేస్తుంది!''

ఆ మాటలకి అర్థం కానట్లు మొహం పెట్టాడు వరుణ్ .

''అసలు దీన్ని ప్రేమ అనరురా... ఒక విధమైన మానసిక స్థితి... 'ఇన్‌ఫాక్చుయేషన్' అంటారు. నువ్వు ప్రేమిస్తే ఆ విషయాన్ని ఆమెకు చెప్పు. ఆమె ఒప్పుకుంటే పెండ్లి చేసుకో... లేకపోతే అంతకంటే అందంగా వున్న అమ్మాయిని చూసి ప్రేమించు'' అన్నాడు ఋషి తేలిగ్గా.

''అమ్మో! ఆమెను గుండెల్లోంచి చెరిపేయటం నా వల్ల కాదు'' అన్నాడు వరుణ్ భయంగా.

''అయితే పన్నేం చేయమంటావ్!''

''అలా అనకురా! నీకు బాగా తెలుసు! నీ సలహా తీసుకుందామని వచ్చానురా!''

''సరే అయితే...! రేపు తొమ్మిది గంటలకు మన రూమ్ ముందు నుంచి ఆ అమ్మాయి వెళ్ళేటప్పుడు లోపలికి పిలిచి నువ్వు ఆమెను ప్రేమిస్తున్నావని చెబుతాను.''

''వద్దురా! అలా చెబితే ఏ అమ్మాయి అయినా చెప్పు తీసుకొని కొడుతుంది.''

''కొడితే కొట్టించుకో''

''ఇదిగో ఇలా పిచ్చిపిచ్చిగా వాగావంటే చంపేస్తాను.''

''ప్రేమలో ఆ మాత్రం రిస్క్ తప్పదు మరి''

''మరేం చెయ్యాలి.''

''చూద్దాం''

''చూద్దాం కాదు! ఆ అమ్మాయి నన్ను ప్రేమించే మార్గం చెప్పు గురూ!''

''యూ ఫూల్! ఆ అమ్మాయి నిన్నెలా ప్రేమిస్తుందిరా! నువ్వు ఆ అమ్మాయిని ప్రేమిస్తున్నావు కాబట్టి ఆమెతో పరిచయం చేసుకొని ఆమెకు అనుగుణంగా ప్రవర్తిస్తూ... ఆమెపై ప్రేమను తెలిపి నిన్ను ఆమె ప్రేమించేలా నువ్వు ప్రయత్నించాలి!''

''అదే ఎలా? అని అడుగుతున్నా!'' అన్నాడు వరుణ్ అర్థం కానట్లు.

''సరేలే! నేను రేపు ఆ అమ్మాయిని పరిచయం చేసుకుంటాను ఇక పడుకో'' అన్నాడు ఋషి.

ఆ రాత్రి ఇద్దరికీ నిద్ర పట్టలేదు.

ఆమెతో ఊహలలో విహరిస్తూ వరుణ్ ఆ రాత్రంతా గడిపాడు.

●●● ఆ దృశ్యాన్ని చూసిన వరుణ్ కంట్లో సన్నటి నీటిధార ఇక ఆగలేనన్నట్లు బయటికొచ్చింది ●●●

కాని ఆమెతో పరిచయం ఎలా చేసుకోవాలి అని ఋషి ఆలోచించసాగాడు.

★ ★ ★

రెండు నెలలు గడిచిపోయాయ్ !

ఆ సమయంలో ఎన్నో మార్పులు జరిగాయ్ !

స్నేహితునితో తన ప్రేమ విషయం చెప్పినప్పటి నుంచి తన ప్రణయ సుందరి ఒక్కసారి కూడా కనిపించలేదు వరుణ్ కు.

దాంతో అతనికేమి చెయ్యాలో బుద్ధి అయ్యేది కాదు.

క్షణక్షణానికి ఆమే గుర్తుకు వచ్చేది. కనులు తెరిచినా... కనులు మూసినా ఆమె కనుల ముందర కనిపించేది.

సూర్యుడు వస్తున్నాడు... చంద్రుడు వెళ్తున్నాడు... కాలం కొవ్వొత్తిలా కరుగుతుంది. కాని ... భరించలేని నిర్లిప్తత మాత్రం అతన్ని విడిచి వెళ్ళేది కాదు.

అలా రోజూ కిటికీ దగ్గర కూర్చొని ఆమె కోసం ఎదురుచూడటం తప్పితే... అతడింకో పని చేసేవాడు కాదు.

రోజురోజుకి కళ్ళు లోపలికి పోతున్నాయి. గడ్డం పెరుగుతుంది. మనిషి బలహీనంగా అవుతున్నాడు.

ఋషి తన ప్రాబ్లమ్ సాల్వ్ చేస్తాడనుకుంటే అతడు కూడా కనిపించకపోవటం వరుణ్ కు మరింత బాధను కలుగజేసింది.

ఆ ఆలోచనలతో రాత్రిళ్ళు అతనికి నిద్రే పట్టేది కాదు... ఆమె రూపం కంటి రెటీనా మీది నుంచి తొలగిపోతేకదా... నిద్రవచ్చేది... ఏ అర్థరాత్రో మాగన్నుగా నిద్రపట్టినా... వెనువెంటనే ఆమె అతని రెప్పల మధ్య ప్రదేశాన్ని ఆక్రమించేది.

ప్రతిక్షణం ఎన్నో ఊహలు.

వాటిలో తను రాజు, ఆమె రాణీ.

కాని ఇక్కడో తేడా వుంది... పూర్వకాలంలో వలే భవనాలు, మేడలు వుండేవి కాదు.

చలం నవలలో వ్రాసినట్లు.

అడవి మధ్యలో తమ కుటీరం... చుట్టూ పూలమొక్కలు... అందంగా విరబూసిన పూలు ... వికసించిన మల్లెలు ఇంటిని కాపలాకాస్తూ విరబూసిన మందారాలు గుమ్మం ముందు ద్వారపాలకులలా వుండేవి. ప్రక్కనే వున్న పిల్ల కాలువలో స్నానం చేస్తూ... ఆ ఇంట్లో... ఆ పరిసరాల్లో ఆ ప్రపంచంలో తామిద్దరే అన్నట్లు పూర్తిగా భావుకత్వంతో నిండిన ఊహాల్లో జీవితాన్ని గడపసాగాడు.

**అసలు దీన్ని ప్రేమ అనరురా... ఒక విధమైన మానసిక స్థితి... 'ఇన్‌ఫాక్చుయేషన్' అంటారు.**

అతను అలా కనులు మూసుకొని ఊహాల్లో ఊసులాడుతున్నప్పుడు అతని తపస్సు ఫలించినట్లు 'అదే మువ్వల శబ్దం' వినిపించింది. హఠాత్తుగా కళ్ళు తెరిచాడు.

అవే నునుపైన పాదాలు... ఎర్రగా పండిన గోరింటాకు.

అతని హృదయంలో పన్నీటి జల్లు... బీటువారిన భూమిని వాన చినుకు ఆర్తిగా ముద్దాడినట్లు.

రివ్వున గువ్వలా అతని హృదయం ఆకసంలో ఎగిరింది.

పరుగుపరుగున బయటికొచ్చాడు ఆనందంగా.

అప్పటికే అతని కన్నుల్లో సన్నగా నీటి పొరలు.

ఆమె ప్రక్కన ఋషి 'తన స్నేహితుడు... నిజంగానే ఆమెను నా కోసం తీసుకొచ్చాడు' అనుకుంటూ కన్నీరు తుడుచుకొని "ఎన్నాళ్ళకొచ్చావ్‌రా ఋషి! ఇన్నాళ్ళు ఏమైపోయావు" అన్నాడు.

"చాలా బిజీరా! అందుకే ఇన్నాళ్ళు రాలేదు! వచ్చేవారం నా పెండ్లిరా! నీవు తప్పకరావాలి! ఓ...! నీకు పరిచయం చేయలేదు కదూ? ఈమె నా ప్రియాన్ని" అన్నాడు.

"నమస్తే" అందామె.

"నమస్తే" అన్నాడు. ఎంత దాచుకున్నా దుఃఖం దాగలేదు. బయటికి రాకుండా బలవంతాన తనను తాను కంట్రోలు చేసుకుంటూ "లోపలికి రండి" అన్నాడు వరుణ్ .

"లేదురా మళ్ళీ వస్తాం!" అంటూ బయటికి నడిచాడు ఋషి.

"అతను... తన స్నేహితుడు ఋషి ఆమె భుజంపై చేయివేసి తీసుకువెళ్తున్నాడు.

ఆ దృశ్యాన్ని చూసిన వరుణ్ కంట్లో సన్నటి నీటిపొర ఇక ఆగలేనన్నట్లు బయటికొచ్చింది. మసక... మసకగా... అస్పష్టంగా... వాళ్ళు కనిపించసాగారు... ఆ తరువాత అంతా అస్పష్టమే... భరించలేనట్లు గట్టిగా కళ్ళుమూసుకున్నాడు.

ఋషి తనను మోసం చేసాడని అతని హృదయం ద్రవించసాగింది.

ఆ తరువాత పదిహేను రోజులకు అతనికి ఋషి దగ్గర నుంచి లెటర్ వచ్చింది.

"డియర్ వరుణ్!

నా మీద నీకు చాలా కోపంగా వుందని నాకు తెలుసు! ఇందులో నేను చేసిన తప్పేమీ లేదురా! నిన్ను మోసం చేయాలన్న ఉద్దేశ్యం కూడా నాకు లేదు! మేమిద్దరం చాలా రోజుల వరకు స్నేహితులుగానే వున్నాం! నేను నీ ప్రేమ విషయం చెబుదామనుకునేంతలోపే ఆమె నాతో తలమునకలయ్యేంత ప్రేమలో పడింది. ఇంకేం చెయ్యను! నువ్వే అర్థం చేసుకో! ఇందులో నా తప్పేమయినా వుందా? అసలు ప్రేమించటం కాదురా! అంతకంటే ముందు ఎలా ప్రేమించాలో నేర్చుకో! చదువును జీవితానికి అన్వయించవద్దని పోట్లాడతావ్‌గా! కాని ఇప్పుడు చూడు– న్యూటన్స్ మూడో సూత్రం ప్రకారం చర్యకు సమానమైన ప్రతిచర్య వుంటుంది. ప్రేమలో కూడా అంతే. అసలు నీలో చర్యే లేనప్పుడు ప్రతిచర్య అసలే వుండదు. విష్ యూ ఆల్ ది బెస్ట్ ఫర్ నెక్స్ట్ లైవ్..."

నీ స్నేహితుడు, ఋషి.

ఆ రాత్రి వరుణ్ కు హాయిగా నిద్రపట్టింది.

ఇప్పుడతని కలల నిండా న్యూటన్ మూడో సూత్రమే...

●